## క్లుప్తంగా

### కానూరులో తల్లీ బిడ్డ అదృశ్యం

పెనమలూరు: కానూరు గ్రామంలో తల్లీ బిడ్డ అదృశ్యం అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు రామాలయం వద్ద చిట్టిబొమ్మ లక్ష్మీ నరసింహస్వామి, తన భార్య రాజేశ్వరి, నాలుగు నెలల బిడ్డతో కలిసి ఉంటున్నాడు. ముఠాపని చేసి జీవిస్తాడు. ఈ నెల 24వ తేదీన నరసింహస్వామి కూలీ పనులకు వెళ్లాడు. అయితే సాయంత్రం ఇంటికి వచ్చి చూసుకోగా భార్య, బిడ్డ కనిపించలేదు. వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన పై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

### నాలా భూముల పరిశీలన



అంబాపురం(విజయవాడరూరల్): వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేయాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన నాలా భూములను విజయవాడ సబ్‌కలెక్టర్ అతిథి సింగ్ బుధవారం పరిశీలించారు. 31, 34, 67/4 తదితర సర్వే నంబర్లలోని భూములను ఆమె చూశారు. ఇన్‌చార్జి తహసీల్దారు విజయ్ కుమార్, ఆర్ఐ రామ్‌సింగ్, వీఆర్వో, విలేజి సర్వేయర్ పాల్గొన్నారు.

### నేటి లోగా దరఖాస్తు చేసుకోవాలి

పెనమలూరు: జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకోవటానికి గురువారమే చివరి తేదీ అని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. రజకులు, షాపులు ఉన్న నాయీ బ్రాహ్మణులు, టైలరింగ్‌షాపులు నిర్వహించే వారికి జగనన్న చేదోడు పథకం అమలు చేస్తుందన్నారు. 2019 నుంచి ఐదు సంవత్సరాల పాటు లబ్ధిదారులకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. ఈ ఏడాది మూడవ సంవత్సరంలో భాగంగా చేదోడు పథకం కింద రూ.10 వేలు సాయం కావాల్సిన వారు గురువారం నాటికి తాడిగడప మున్సిపాలిటీలో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేయాలని సూచించారు. కుటుంబ నెలసరి ఆదాయం రూ.12 వేలు, లబ్ధిదారుల వయస్సు డిసెంబర్ 2022 సంవత్సరం నాటికి 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. రజక, నాయీ బ్రాహ్మణులు, టైలరింగ్ చేసే వారు తహసీల్దార్ నుంచి కుల ధ్రువీకరణ పత్రం, షాపుల రిజిస్ట్రేషన్ లైసెన్సు ఉండాలని తెలిపారు. ఆధార్ ఫోన్‌కు లింకు చేసి ఉండాలని అన్నారు. సచివాలయాల్లో వెల్ఫేర్ సెక్రటరీకి దరఖాస్తు అందచేయాలని సూచించారు.

### వరకట్నం వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల మసీదు ప్రాంతానికి చెందిన షేక్ గౌసి గత పది సంవత్సరాల క్రితం కానూరు సనత్‌నగర్‌లో ఆర్ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న షేక్ సలీంను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్న కానుకలు ఇచ్చారు. వీరికి కుమార్తె ఉంది. అయితే భర్తతో పాటు అత్త అదనపు కట్నం తీసుకురావాలని వేధించటంతో స్థలం అమ్మి సొమ్ము ఇచ్చారు. అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### కంకిపాడులో మళ్లీ చోరీ



కంకిపాడు: పట్టణంలో మళ్లీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా చోరులు తెగబడ్డారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో రెండో చోరీ ఘటన వెలుగు చూడటంతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. పులి రామారావు వీధిలో అడపాల ఉమామహేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటోంది. ఈ నెల 14న తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం ఉమామహేశ్వరరావు పని మీద కంకిపాడు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లి చూసే సరికి ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లే సరికి బీరువాలో ఉన్న వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గుర్తించారు. చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. అదనపు ఎస్ఐ లక్ష్మి నేతృత్వంలో సిబ్బంది ఘటనాస్థలాన్ని సందర్శించారు. బీరువాలో ఉన్న రూ.50 వేలు నగదు, వెండి గ్లాసు, వెండి మొలతాడు, పూజ సామగ్రి చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం బృందం చోరీ ప్రదేశంలో పలు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నిధులు మంజూరు

ఉంగుటూరు: మండల పరిధిలోని గారపాడు గ్రామానికి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన ద్వారా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. అంబేద్కర్ ఉత్సవ్ ధామ్ ద్వారా కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతామన్నారు.

# ఓటు ప్రతి ఒక్కరి హక్కు



పెనమలూరులో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీవో విజయ్‌కుమార్



విజేతలకు బహుమతులు అందిస్తున్న టీవీ సతీష్, పక్కన ప్రసాద్ తదితరులు

కంకిపాడు: రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన హక్కు ఓటు అని నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీవీ సతీష్ అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం మండలంలోని 64 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమం కంకిపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించారు. ముగ్గుల పోటీలు, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సీనియర్ సిటిజన్లను సత్కరించి కొత్త ఓటర్లకు డిజిటల్ ఓటరు కార్డులను పంపిణీ చేశారు. కంకిపాడు పోలింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీవీ సతీష్ మాట్లాడుతూ ఓటు హక్కు పొందటంతో పాటుగా, సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాయితీ గల నేతలను ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ**

పెనమలూరు: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పెనమలూరులో సీనియర్ ఓటర్లను బుధవారం సన్మానించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంకు సంబంధించి సీనియర్ ఓటర్లకు పూలదండలు వేసి శాలువలు కప్పి సత్కరించారు. అలాగే కొత్త ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి గ్రామంలో ఓటు హక్కు పై అవగాహన కల్పించటానికి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరంగా 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఓటు హక్కుకు అర్హులన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటును నమోదు చేసుకుని ఎన్నికల్లో మంచి వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఓటు లేనివారు ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌వోలకు దరఖాస్తు చేస్తే ఓటు హక్కు వస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి వారికి ప్రశంసాపత్రాలు అందచేశారు. తహసీల్దార్ టీవీ సతీష్, డీటీలు భవాని, శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఘనంగా చేశారు. ఓటర్లకు అవగాహన కల్పించటానికి కాలేజీ నుంచి కామయ్యతోపు వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకుంటే ప్రశ్నించే అవసరం ఉండదని విద్యార్థులు నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కానూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



కారంపూడిని సత్కారిస్తున్న ఉపాధ్యాయులు

**ఓటు హక్కు విలువైనది**

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్ కారంపూడి సుబ్బారావును హెచ్ ఎం ఆర్. విజయరామారావు, ఉపాధ్యాయులు సత్కరించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. 19 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కుకు అర్హులని తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పలు గ్రామాల్లో సీనియర్ సిటిజన్లకు వీఆర్వోలు సన్మానాలు చేశారు. పి.నైనవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వీఆర్వో బసవయ్య, గ్రేడు5 సెక్రటరీ కళ్యాణి, గ్రామస్తులు పాల్గొని సీనియర్ సిటిజన్ వేములకొండ సీతారామయ్యకు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ నిర్వహించారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ దొండపాటి ఏసురత్నం వీఆర్ఏ గజగంటి షిలక్ సన్మానం చేసింది. పాతపాడు, నున్న గ్రామాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల తహసీల్దారు కార్యాలయంలో ఉత్తమ డేటా ఎంట్రీ ఆఫీసర్ డి.హేమంత్‌కు, ఉత్తమ బూత్‌స్థాయి అధికారి సాతులూరు ఏడుకొండలకు అధికారులు సన్మానం చేశారు.

**ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది**

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, డి.ఝాన్సీరాణి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బాపులపాడు, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లలో బుధవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని చెప్పారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

### జెడ్పీ పాఠశాల తనిఖీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి సి.రేణుక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ నోట్స్, పలు రికార్డులు పరిశీలించారు. పలు తరగతుల్లోని విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. 6 నుంచి 10వ తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు అవలంబిస్తున్న పాఠ్య బోధన పద్ధతులను తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

### రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు హెచ్ఎంకే విద్యార్థులు



వి.పునిత శ్రీ



వి.అవినాష్

కంకిపాడు: స్విమ్మింగ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్‌కు గోసాల హెచ్ఎంకే విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సుకుమిత్‌కౌర్ బుధవారం క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈడుపుగల్లు స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 24న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వి.పునితశ్రీ, వి.అవినాష్ ఉత్తమ ప్రతిభ చాటి 66వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు హాజరవుతారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను డైరెక్టర్ ఆర్.వసంత్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థుల ఉన్నతికి పది కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరత్నం

నున్న(విజయవాడరూరల్): విద్యార్థుల ఉన్నతికి పదో తరగతి ఎంతో కీలకమని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం అన్నారు. సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రతిభకు ప్రేరణ–భవితకు పునాది అనే అంశం పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నున్న, జి.కొండూరు వసతి గృహాలు, కస్తూరిబాయి వసతి గృహాల్లో బాలికలు పాల్గొన్నారు. ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతిభకు ప్రేరణ–భవితకు పునాది పదో తరగతి విద్యేనని తెలిపారు. నేడు ఉన్నత పదవుల్లో వున్న అనేక మంది సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకున్నవారేనని గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ప్రభుత్వ వసతి గృహాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడాలేని విధంగా పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉన్నత చదువులు చదవడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెలన్నర రోజుల్లో జరిగే పదవ తరగతి కామన్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఏఎస్‌డబ్ల్యుఓ యూవీ కోటేశ్వరరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పి.సుజాత, కృష్ణకుమారి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పింగళి వెంకయ్య విగ్రహావిష్కరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాతీయ జెండా ప్రచారకర్త షేక్ మాబు సుభాని (జెండా సుభాని) చేతుల మీదగా పింగళి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని పేర్కొన్నారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పోణంగి సాయి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి పింగళి వెంకయ్య మనుమరాలు పింగళి సుశీల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం జాతీయ పతాక దేశభక్తి గీతాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు.

## బోధనలోనే కాదు సైక్లింగ్‌లోనూ సూపర్

సూపర్ రాండోనియర్‌గా టైటిల్ గెలిచిన ప్రొఫెసర్ జగదీష్



పీవీపీ సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ శివాజీబాబు నుంచి అవార్డు అందుకుంటున్న జగదీష్

పెనమలూరు: విద్యార్థులకు చదువు చెప్పటమే కాదు..సైకిల్ తొక్కి తన సత్తాను చాటాడు ప్రొఫెసర్ డాక్టర్ వెంగల జగదీష్. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్, ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ జగదీష్ సైక్లింగ్‌లో అత్యున్నత ప్రతిభ చాటి సూపర్ రాండోనియర్ టైటిల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు టైటిల్ ప్రదానం చేశారు. జగదీష్ వివరాలు తెలుపుతూ పారిస్‌లోని ఆడాక్స్ క్లబ్ ఆఫ్ పారిస్, ఆడాక్స్ క్లబ్ ఆఫ్ ఇండియా కేంద్రంగా ఈ ఈవెంట్ నిర్వహిస్తారన్నారు. విజయవాడ రాండోనియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 600, 400, 200 కిలోమీటర్ల చొప్పున లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేశానన్నారు. జనవరి 21వ తేదీన విజయవాడ, మచిలీపట్నం, తిరువూరు, కోదాడ 600 కిలోమీటర్లు, గత డిసెంబర్‌లో విజయవాడ–చిట్యాల 400 కిలోమీటర్లు 24 గంటల్లో పూర్తి చేశానన్నారు. గత రెండు సంవత్సరాలుగా సైక్లింగ్ ప్రాక్టీస్ చేసి లక్ష్యాన్ని సాధించానని వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం, సహచర అధ్యాపకులు, అమరావతి బైస్కిల్ క్లబ్ రావులపాటి రాము జగదీష్‌ను అభినందించారు.

## ప్రజలకు అందుబాటులో అన్ని సదుపాయాలు



మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచులు

గన్నవరం: వేగంగా అభివృద్ధి చెందుతున్న గన్నవరం నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తుండడం శుభపరిణామమని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 23వ ఆల్ఫా మార్ట్ బ్రాంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆల్ఫా మార్ట్ ద్వారా సూపర్‌బజార్, అరబిక్ హోటల్, షవర్మా, ఇరానీ టీ, ఫంక్షన్ హాలును ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, డొక్కు వెంకన్నబాబు, ఆల్ఫా ఎండీ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జన్మనక్షత్ర పూజలు



అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని, స్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై స్వామి వారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శతకలశాలతో విశేష పూజలు, పన్నీరు అభిషేకాన్ని ఆలయ అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామానుజాచార్యులు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మీ స్వీట్‌హోం అధినేత కొల్లి వెంకట పూర్ణచంద్రరావు సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఉప సర్పంచ్ అప్పన కనక దుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సంపూర్ణ వ్యక్తిత్వం కోసమే యువజనోత్సవాలు



తెలుగమ్మాయి విజేతలతో కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం

ఉంగుటూరు: విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువజనోత్సవాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి యువజనోత్సవాలు (యువర్ ఫెస్ట్–2023) బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో 20 కళాశాలల నుంచి 97 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇంజినీర్కా మహా సంగ్రామ్ పోటీలో కళాశాలకు చెందిన డి.పూజిత రూ.50 వేలు ప్రథమ బహుమతి, వంశీ కృష్ణ రెండవ బహుమతి రూ.25 వేలు, సాయి శ్రీకర్ రూ.15 వేలు దక్కించుకున్నారు. అదే విధంగా తెలుగమ్మాయి పోటీలో నాగశ్రీ విజేతగా నిలిచారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ రాజశేఖర్ విజేతలను అభినందించారు. రామ్ చైదరి, నరేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న సాంబశివరావు

గన్నవరం రూరల్: బాలల హక్కుల రక్షణ అందరి సామాజిక బాధ్యత అని సూరంపల్లి సచివాలయం కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో బాలల హక్కులపై బుధవారం అవగాహన సదస్సులు క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అన్ని రకాల వివక్షతలను నిర్మూలించాలన్నారు. బాలలకు ఇబ్బందులు కలిగితే 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఆత్మ విశ్వాసంతో లక్ష్యాలు సాధించాలని చెప్పారు. జీవన నైపుణ్యాల పెరుగుదలకు హక్కులు తప్పనిసరని పేర్కొన్నారు. ముస్తాబాద ఎంపీహెచ్‌ఏ సాంబశివరావు, మహిళా పోలీసులు శ్రావణి, ఆశాబీ, సమన్వయకర్త ప్రభాకర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.






## యనమలకుదురులో రక్తదానం



రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న నిర్వాహకులు

పెనమలూరు: యనమలకుదురులో యువత బుధవారం రక్తదానం చేశారు. గ్రామానికి చెందిన పవన్ ఈశ్వర్ జయంతి సందర్భంగా చైతన్య బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో యువత పాల్గొని రక్తదానం చేశారు. దాదాపు 120 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి కాపాడటానికి తాము రక్తదానం చేశామని యువకులు తెలిపారు. పవన్‌ఈశ్వర్ తల్లిదండ్రులు, మిత్రులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట



చలివేంద్రపాలెంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చలివేంద్రపాలెం గ్రామ సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గ్రామంలో బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ శివనాగిరెడ్డి ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ 60 ఏళ్లు నిండిన 79 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద వర్గాలకు అండగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అర్హులందరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ రాధాదేవి, నెప్పల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆరోగ్య సిబ్బంది జ్యోతిర్మయి, జ్యోతిరాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## రెడ్డయ్యకు ఘన నివాళి



రెడ్డయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు

కంకిపాడు: మాజీ పార్లమెంటు సభ్యులు కేపీ రెడ్డయ్య నేటితరం నేతలకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు తెలిపారు. కేపీ రెడ్డయ్య సంస్మరణ సభ బుధవారం కంకిపాడు సింహాల బొమ్మ సెంటరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రామారి చిరంజీవి తొలుత రెడ్డయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ విలువలు గల నాయకుడు రెడ్డయ్య అని కొనియాడారు. అనంతరం పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండి నాంచారయ్య, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, నాయకులు తంబాబత్తుల ఓంకారం, టి.వెంకటేశ్వరరావు, షేక్ అహ్మద్, వంకదారు చిట్టిబ్బాయ్, జి.పరమేశ్వరరావు, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## యువతను సామాజిక బాధ్యతతో కాపాడాలి

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్క్‌షాపు నిర్వహించారు. ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలకు బానిసలైన యువతను సామాజిక బాధ్యతతో కాపాడాలని చెప్పారు. మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు గురించి వివరించి వారిలో మార్పు తీసుకురావాలని తెలిపారు. సోషల్ మీడియా వల్ల మంచి కంటే కీడు ఎక్కువగా జరుగుతుందన్నారు. వీటిని నియంత్రించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు, సైకాలజిస్టు జి.అనూష, జోనల్ కోఆర్డినేటర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

